


# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 25, 2026 | సంపుటి : 2 | సంచిక : 194 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

◆ బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
◆ ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ



**కోల్‌కతా,ఏప్రిల్24 :** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు,ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హావ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.



## ఆర్టీసీ సమ్మెలపై ప్రభుత్వం సానుకూలం

◆ సమ్మెపై జెఏసితో మంత్రుల చర్చలు ◆ ఆర్టీసీని బలోపేతం చేద్దామన్న భట్టి

**హైదరాబాద్,ఏప్రిల్24 :** ఆర్టీసీ సమ్మెపై చర్చలు కొలిక్కి వచ్చినట్లేనని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల సానుకూలతతో ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఆర్టీసీని మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నమైంది. అప్పటి పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించారో మీకందరికీ తెలుసు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం. ఆర్టీసీకి సంబంధించిన పాలన, విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దాం. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించు కుందామని భట్టి అన్నారు. మొత్తం 32 డిమాండ్లను జేఏసీ నేతలు మంత్రుల ముందు ఉంచారు. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రకటించిన నేపథ్యంలో.. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు గుర్తింపు, పీఆర్సీపై చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బోర్డు పరిధిలోని సమస్యలను యాజమాన్యం, ఉద్యోగులు పరిష్కరించుకోవాలని.. ప్రభుత్వ పరిధిలోని అంశాలను పరిష్కరిస్తామని మంత్రులు తెలిపారు.

## 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు
- ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2లో..



## నూతన దిశగా పంచాయితీరాజ్ వ్యవస్థ

ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్

**అమరావతి,ఏప్రిల్24 :** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నూతన దిశగా ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం స్పందించారు.

2లో



## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

- ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి
- ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

**హైదరాబాద్,ఏప్రిల్24 :** రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

» సమస్యను పరిష్కరించకుండా కమిటీలతో కాలయాపన
» బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపాటు



2లో..

**హైదరాబాద్,ఏప్రిల్24 :** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి.. తద్వారా రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చిందన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసింది.

## తొలగిన ఉద్రిక్తతలు..

### డ్రైవర్ అంత్యక్రియలకు కుటుంబసభ్యుల అంగీకారం



**నర్సంపేట:** వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో ఉద్రిక్త పరిస్థితులు తొలగిపోయాయి. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తొలుత పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ తర్వాత డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు, జేఏసీ నేతలతో పోలీసుల మంతనాలు కొలిక్కి వచ్చాయి. సమయం మించిపోవడంతో అంతిమ యాత్రను కొనసాగించేందుకు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. ఆర్టీసీ జేఏసీ, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల నిర్ణయమే ఫైనల్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ప్రకటించారు. అనంతరం ముత్తోజిపేట నుంచి కేంద్ర మంత్రి బయలుదేరారు. మరికాసేపట్లో అంత్యక్రియలు జరగనున్నాయి.

## హెచ్‌సీఏ అవకతవకలపై దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీసీఐడీలోని సిట్‌తో దర్యాప్తు



2లో..

## శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం



- శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్
- మండిపడ్డ అద్దంకి దయాకర్

**హైదరాబాద్,ఏప్రిల్24 :** ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు.



## తెలంగాణలో డిజిటల్ విప్లవం.. వాట్సాప్‌కే విద్యార్థుల వార్షిక రిపోర్ట్ కార్డులు

తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాలనలో మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా గవర్నమెంట్ పాఠశాలల్లో చదువుతున్న 5వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థుల వార్షిక రిపోర్ట్ కార్డులు నేరుగా తల్లిదండ్రులకు చేరాయి. 18 లక్షలకుపైగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు మీ సేవ ద్వారా నేరుగా పేరెంట్స్ వాట్సాప్ నెంబర్‌కు విజయవంతంగా పంపిణీ చేసింది.

ఈ విప్లవాత్మక కార్యక్రమాన్ని ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలో మీ సేవ ద్వారా అమలు చేశారు. దీనిద్వారా విద్యార్థుల అకడమిక్ రికార్డులు స్కూల్‌కు వెళ్లకుండానే.. తక్షణం,



## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం.. ఒకరికి ఉద్యోగం: మంత్రి పొన్నం

**హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని మంత్రి తెలిపారు. ఆ కుటుంబానికి రూ. 10 లక్షల సాయం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలు పూర్తయ్యేలా జేఏసీ నేతలు చొరవ తీసుకోవాలని కోరారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయవద్దని విపక్షాలకు సూచించారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

## తెలంగాణలో మరో కొత్త పార్టీ

- నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత
- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం



02

**హైదరాబాద్,ఏప్రిల్24 :** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు.

## నూతన దిశగా పంచాయితీరాజ్ వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి
గ్రామ స్వరాజ్యం దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తోందని.. స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగుతోందన్నారు. గ్రామ సభలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ సమన్వయంతో గ్రామ సభలు, పల్లె పండుగ 1.0 / 2.0 విజయవంతం అయ్యాయని అన్నారు. స్వచ్ఛ రథాలు, ఎస్‌ఎల్‌ఆర్‌ఎమ్(÷ూఒఖీఓ) కార్యక్రమాలు, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ గ్రామ స్వరాజ్యం యాత్రలో భాగస్వాములైన ప్రజలకు, సర్పంచ్‌లకు, వార్డ్ సభ్యులకు, పంచాయతీరాజ్ అధికార యంత్రాంగానికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి
ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరం. కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతోపాటు వారి సమస్యలు పరిష్కరించక పోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైంది. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలి. ఆర్టీసీ కార్మికులు ముందుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని రామ్ విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, భారతీయ జనతా పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసింది. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ
సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం.. కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షానే నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని' ఆ పార్టీ తెలంగాణ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## తెలంగాణలో
## మరో కొత్త పార్టీ

మొదటి పేజీ తరువాయి
కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

మొదటి పేజీ తరువాయి
హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

మొదటి పేజీ తరువాయి
శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్‌ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ
తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్‌ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులను నమ్మొద్దని.. కచ్చితంగా కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## హెచ్‌సీఏ అవకతవకలపై దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

మొదటి పేజీ తరువాయి
జరగాలని, అపెక్స్ కౌన్సిల్ జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షణలో హెచ్‌సీఏ పనిచేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రికెట్ సంఘం అక్రమాలపై సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీఏకు స్వయం ప్రతిపత్తి ఉందన్న కారణంతో న్యాయవ్యవస్థ పరిధి నుంచి తప్పించుకోలేరని, అవినీతి, అక్రమాలు జరిగినప్పుడు పారదర్శకత విషయంలో కోర్టులు జోక్యం చేసుకుంటాయని న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక పేర్కొన్నారు. దర్యాప్తునకు అధికారులు, సిబ్బంది సహకరించాలని ఆదేశించారు.

# 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మొదటి పేజీ తరువాయి
రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై శుక్రవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,÷నాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్రస్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.అంతే గాకుండా ధాన్యం కొనుగోలుకు గాను కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లీనర్లు,డ్రైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలిలను నియమించాలన్నారు. తూకం ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్ల కుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం తరలి రాకుండా ఉండేలా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అయ్యే మొత్తాలను రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖా మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

## రాజమండ్రి కోర్టు వద్ద ఉత్కంఠ ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్

### - కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలింపు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసు మొదటి నుంచీ వివాదాస్పదంగానే కొనసాగుతోంది. తాజాగా బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యంగా కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇప్పటికే అనంతబాబు బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపణలు రావడంతో కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్ట్ చేసే సమయంలో కోర్టు సముదాయం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అరెస్టు అనంతరం అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయనపై తదుపరి విచారణ కొనసాగనుంది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అనంతబాబును స్టేషన్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ ఆయనను విచారించి తదుపరి న్యాయ ప్రక్రియలు చేపట్టనున్నారు. ఈ కేసులో సాక్షులు భయపడేలా చేయడం లేదా కేసు నుంచి వెనక్కు తగ్గించేలా ఒత్తిడి తేవడం వంటి చర్యలు న్యాయపరంగా తీవ్రంగా ఉన్నాయి. అందుకే ఈ ఆరోపణలు నిజమని తేలితే, అనంతబాబుపై కేసు మరింత బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతం అనంతబాబు అరెస్టుతో కేసు మరో మలుపు తిరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెయిల్ రద్దు పిటిషన్‌పై కోర్టు తీసుకునే నిర్ణయం, సాక్షుల వాంగ్మూలాలు, పోలీసుల దర్యాప్తు కలిసి ఈ కేసు తుది తీర్పును నిర్ణయించనున్నాయి. ఈ కేసు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో, కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే విషయం ఉత్కంఠగా మారింది.

## వందేమాతరం సామూహిక గీతాలపన

### మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా

గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్‌ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

## కేదార్‌నాథ్‌కు భారీగా తరలివస్తున్న భక్తులు

చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

## ఆస్పత్రిలో మృతదేహంపై ఆభరణాలు చోరీ

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ విభాగంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఏల్పుల బాలవ్వ(80) అనే వృద్ధురాలు మృతిచెందగా ఆమె చెవులకు ఉన్న ఆభరణాలు మాయమయ్యాయి. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల బాలవ్వ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలవ్వ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకో వాలని బంధవులకు సూచించాడు. దీంతో బంధువులు బాలవ్వ మృతికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆసుపత్రి సిబ్బంది నుంచి తీసు కొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారి స్వ గ్రామానికి తరలించారు. ఇంటికి వెళ్లిన తర్వాత చూడగా బాలవ్వ చెవులకు ఉన్న కమ్మలు కనిపించక పోవడంతో వెంటనే ఆమె అల్లుడు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సెక్యూరిటీ గార్డును నిలదీశాడు. అతను తనకు సంబంధం లేదని చెప్పాడు. దీంతో బాలవ్వ అల్లుడు శంకర్ జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## తక్షణం ఆస్తిపన్ను చెల్లించండి

### - ఐదుశాతం రాయితీకి మరో నాలుగు రోజుల గడువు

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

## ఆర్టీసీ కార్మికులకు అఖిలపక్షం మద్దతు పోరాటం చేయాలే తప్ప ప్రాణాలు తీసుకోవద్దు

### - ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్టీసీ సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉందని అన్నారు. ఆర్టీసీ జాబ్ ఆధ్వర్యంలో మూడోరోజు ఉధృతంగా కొనసాగుతున్న సమ్మెలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్మికులు పట్టుదలతో తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలే కానీ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కార్మికుల ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతునిస్తుందని, తానే ముందుండి సమ్మెకు నాయకత్వం వహిస్తానని తెలిపారు. కార్మికులు ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, శాంతియుతంగా సమ్మె నిర్వహించాలని ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం కొత్తగూడెం మేయర్ మూడు గణేశిష్, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సిపిఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జై భీమ్ రావు పార్టీ రాష్ట్ర నాయకుడు యెర్ర కామేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాపన్న నాయకులు మధు, సంజీవ్, సురేందర్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, భారతీయ జనతా పార్టీ నాయకుల తో పాటు పలు పార్టీలకు కార్మిక సంఘాలకు చెందినవారు మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు బి.ఎన్.రావు, నజీర్, భాస్కర్, సరస్వతి, రేణుక, రహంతుల్లా, సైదులు, శేషు, రాటి పాల్గొన్నారు. కాగా మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కు నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటాన్ని ప్రదర్శించారు.

## మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం

### - ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్

చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ÷ూష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

## తమిళనాట బలహీన పడుతున్న ద్రవిడ వాదం

# ద్రవిడ కోటలో ప్రారంభమైన హిందుత్వ దండయాత్ర

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

సాంస్కృతిక మరియు రాజకీయ అంశాల కలయికగా ప్రారంభించిన ద్రవిడ వాదం కేవలం రాజకీయ అధికార సాధనకే పరిమితమైపోయింది. ద్రావిడులు ఈ దేశ మూలవాసులు అంటూ విదేశీయులు ఆర్యులు, ద్రావిడులను భారత దేశ దక్షిణ భాగానికి నెట్టి వేశారని ప్రచారం చేశారు.

- **ఉత్తర భారత దేశ పెత్తనం చెల్లదు,ఉత్తర భారత హిందీ భాష చెల్లదు అసలు హిందూత్వం చెల్లదు అంటూ తమిళనాడులో బలమైన ప్రచారం జరిగింది**

- **భారతదేశంలో అటు పశ్చిమబెంగా ఇటు తమిళనాడు తీర ప్రాంతాలలో సముద్ర మార్గం ద్వారా వచ్చిన ఆంగ్లేయులు బలమైన స్థావరాలు ఏర్పరచుకొని భారత దేశం లోని ఈ ప్రాంతాల్లో తమ ప్రభావాన్ని నెలకొల్పుకున్నారు**

భారతదేశంలోని మనుషులను మానసిక బానిసలుగా చేసుకోవడం కొరకు ఆంగ్లేయులు రకరకాల పద్ధతులు అవలంబించారు.సాంస్కృతిక మరియు సామాజిక పునాదులు ద్రవిడ వాదం ప్రధానంగా దక్షిణాది భాషలు (ముఖ్యంగా తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం) మరియు సంస్కృతి యొక్క విశిష్టతను చాటిచెప్పడానికి పుట్టింది.

భాషా గుర్తింపు ద్రవిడ భాషలకు ప్రాచీన చరిత్ర ఉందని, ఇవి సంస్కృతం నుండి పుట్టినవి కాదని నిరూపించే ప్రయత్నం జరిగింది.ఆర్య-ద్రవిడ సిద్ధాంతం ద్రవిడులు ఈ దేశపు మూలవాసులని, ఆర్య సంస్కృతి కంటే ద్రవిడ సంస్కృతి భిన్నమైనదని ఈ వాదం బలంగా ప్రచారం చేసింది.సామాజిక సంస్కరణ జ్యోతిరావు పూలే, ఇ.వి. రామస్వామి (పెరియార్) వంటి నాయకులు కుల వివక్షకు వ్యతిరేకంగా, బ్రాహ్మణేతర ఉద్యమంగా దీనిని ప్రారంభించారు.

రాజకీయ పరిణామం సాంస్కృతిక ఉద్యమంగా మొదలైన ఇది కాలక్రమేణా శక్తివంతమైన రాజకీయ ఉద్యమంగా మారింది.రాజకీయ అధికారం: తమిళనాడులో 'జస్టిస్ పార్టీ' మరియు ఆ తర్వాత వచ్చిన 'ద్రవిడ కజగం (DK)', 'ద్రవిడ మున్నేట్ర కజగం (DMK)' వంటి పార్టీలు ద్రవిడ అస్తిత్వాన్ని రాజకీయ అస్త్రంగా మార్చుకున్నాయి.

**హిందీ వ్యతిరేక ఉద్యమం**




అప్పటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం హిందీని రుద్దడాన్ని వ్యతిరేకించడం ద్వారా ఇది రాజకీయంగా మరింత బలపడింది.

రాష్ట్రాల హక్కులు సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు ఎక్కువ స్వయంప్రతిపత్తి ఉండాలని, దక్షిణాది ప్రయోజనాలను కాపాడాలని ఈ వాదం రాజకీయ పోరాటాలు చేసింది. ద్రవిడ వాదం సాంస్కృతిక అస్తిత్వం కోసం మొదలై, ఆ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి రాజకీయ మార్గాన్ని ఎంచుకుంది.తమిళనాడు హిందూత్వానికి బలమైన కోట.

- **భారతదేశ స్వాతంత్ర్య సాధన తరువాత భారతీయులంతా సేద తీరినట్టుగా భావించి సంస్కృతి నాగరికతల పరిరక్షణ కంటే రాజకీయ అధికార సాధన అతి ముఖ్యమని భావించడం మొదలైంది**

ఆ పరిణామ క్రమంలో తమిళనాడులో ద్రవిడ వాదం మొలకెత్తింది. స్వాతంత్రం సాధించిన పార్టీగా ప్రజల్లో పేరు పొందిన కాంగ్రెస్ తమిళనాడులో కూడా తమ పాలనను స్థిరీకరించుకున్నది.

- **కాంగ్రెస్ చేతుల్లో నుండి కాంగ్రెస్ కబంధహస్తాల నుండి విముక్తి సాధించడానికి తమిళనాడులో ఎంచుకున్న ఏకైక మార్గం రాజకీయ పోరాటం. దానికి హేతువు ద్రవిడ వాదంగా మారింది**

- **తమిళనాడులో ఇప్పుడు గాలి మారుతున్నది. అన్ని పార్టీలదీ ద్రవిడ భావజాలమే. కానీ ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. హిందూత్వం బలం పుంజుకుంటోంది**

దశాబ్దాలుగా ద్రవిడ భావజాలానికి కంచుకోటగా ఉన్న తమిళనాడులో ఇప్పుడు రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది.

- **సామాజిక న్యాయం, హేతువాదం, బ్రాహ్మణ వ్యతిరేకత పునాదులపై నిర్మితమైన ద్రవిడ రాజకీయాలకు సవాల్ విసురుతూ హిందుత్వ శక్తులు బలంగా పనిచేస్తున్నాయి**

- **ఇదే అదునుగా భారతీయ జనతా పార్టీ తన హిందూత్వ ఎజెండాను బలంగా వినిపిస్తోంది**

- **ముఖ్యంగా "తిరుప్పరంకుంద్రం దీపం" వివాదాన్ని ఆయుధంగా చేసుకున్న బిజెపి హిందుత్వ శక్తుల తో కలిసి బలంగా పనిచేస్తున్నది. ఆ ప్రాంతాన్ని దక్షిణ అయోధ్యగా ప్రకటించి సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపింది**

- **ఉత్తరాదిలోని అయోధ్య సెంటిమెంట్‌ను తమిళనాట స్థానిక ఆధ్యాత్మికతతో ముడిపెట్టడం ద్వారా ద్రవిడ పార్టీల మూలాలను దెబ్బతీయాలన్నది బిజెపి వ్యూహంగా కనిపించింది**

ద్రవిడ వాదం వర్సెస్ హిందుత్వం తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే వంటి ప్రధాన పార్టీలన్నీ ద్రవిడ సిద్ధాంతంపైనే ఆధారపడి ఉన్నాయి.

- **పెరియార్ రామసామి ఆశయాలతో మొదలైన ఈ ఉద్యమం.. దేవుడు, మతం కంటే ప్రాంతీయ గుర్తింపుకే ప్రాధాన్యతనిచ్చింది**

- **అయితే, తమిళ ప్రజల్లో లోతైన ఆధ్యాత్మికత, భక్తి భావం మెండుగా ఉండటాన్ని బిజెపి తనకు అనుకూలంగా మార్చుకుంటోంది**

తమిళనాడు ఆరాధ్య దైవం మురుగన్ భక్తులను ఆకట్టుకోవడానికి గతంలో వేల్ యాత్ర చేపట్టిన బిజెపి.ఇప్పుడు రాముడిని, మురుగన్‌ను ఒకే ఆధ్యాత్మిక గొడుగు కిందికి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. తద్వారా హిందూ ఓటు బ్యాంకును ఏకీకృతం చేయాలని చూస్తోంది.

- **పడికట్టు పదాలతో సెంట్రిక్ కమ్యూనిజం సిద్ధాంతలోకి జారుకున్న ద్రవిడ వాదం మెల్లమెల్లగా మొనాటని గా మారింది**

తమిళ ప్రజల్లో ద్రవిడ రాజకీయవాదము, హిందూ సాంస్కృతిక వాదము పైన పునఃశ్చరణ మొదలయ్యింది.

- **ద్రావిడ వాదం వల్ల తమ హిందూ ధార్మిక భావాలు దెబ్బతింటున్నాయని తమిళ ప్రజలు గుర్తించడం ప్రారంభమైంది**

పెరుగుతున్న అసహనం.. మారుతున్న ఆలోచన

- **ద్రవిడ పార్టీలు అనుసరిస్తున్న హేతువాదం పేరుతో హిందూ దేవుళ్లను లేదా ఆచారాలను కించపరుస్తున్నారనే భావన ప్రస్తుతం తమిళ హిందువుల్లో పెరుగుతోంది**

- **ఇతర మతాల వారు తమ విశ్వాసాల పట్ల పట్టుదలగా ఉన్నప్పుడు, హిందువులు మాత్రమే ఎందుకు తమ మతాన్ని విమర్శించుకోవాలనే ప్రశ్నలు సామాన్యుల నుంచి వినిపిస్తున్నాయి**

దీనికి తోడు రాష్ట్రంలో మత మార్పిళ్ల అంశం కూడా హిందూత్వ వాదానికి బలాన్నిస్తోంది. ద్రవిడ నేతలు హిందూ పండుగలకు శుభాకాంక్షలు చెప్పకపోవడం వంటి అంశాలను బిజెపి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ, వారిలో ధార్మిక చైతన్యాన్ని రగిలిస్తోంది.

- **2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం**

గత పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకున్న బిజెపి, ఇప్పుడు 2026 అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్‌గా పెట్టుకుంది.కేవలం అభివృద్ధి మంత్రం మాత్రమే తమిళనాట పనిచేయదని గ్రహించిన ఆ పార్టీ, భావోద్వేగపూరితమైన ఆధ్యాత్మిక అంశాలను ఎంచుకుంది. తిరుప్పరంకుంద్రం వంటి చారిత్రక క్షేత్రాల ప్రాముఖ్యతను పెంచడం ద్వారా అన్నాడీఎంకే స్థానాన్ని ఆక్రమించి, ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని బిజెపి వ్యూహరచన చేస్తోంది.

- **ద్రవిడ సిద్ధాంతం పట్ల యువతలో తగ్గుతున్న ఆకర్షణ, పెరుగుతున్న ఆధ్యాత్మిక ధోరణి బిజెపికి సానుకూల అంశాలుగా మారుతున్నాయి**

తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు కేవలం అవినీతి లేదా అభివృద్ధి చుట్టూ కాకుండా..తమిళ రాజకీయాలు ఇప్పుడ్ను ద్రవిడ వాదం వర్సెస్ హిందూ ధర్మం ..ఆందోళన వర్సెస్ ఆధ్యాత్మికత అనే కొత్త కోణంలోకి మళ్లాయి

ద్రవిడ పార్టీలు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాలు, బిజెపి విసురుతున్న హిందూత్వ సవాళ్లు ఈ తాజా ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన పోరుకు దారి తీసాయి. ఈ సిద్ధాంతాల పోరాటంలో తమిళ ఓటరు ఎటువైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

తమిళనాడులో 23 ఏప్రిల్ 2026 రోజున అసెంబ్లీ ఎన్నికల్లో హిందుత్వ ప్రభావం స్పష్టంగా కనిపించింది. హిందుత్వ శక్తులకు తక్షణ అధికారం లభిస్తుందా లేదా అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు.

- **కానీ తమిళనాడు లో ద్రావిడ వాదానికి హిందుత్వవాదము బలమైన ప్రత్యర్థిగా మాత్రము నిలిచింది అన్న విషయము మే 4 వ తేదీన జరిగే ఎలక్షన్ కౌంటింగ్ లో తెలిసిపోతుంది**

- **ఈ ఎన్నికల్లో ఒక్క విషయం మాత్రం స్పష్టంగా కనిపించింది.. తమిళ నేల మళ్లీ తన మూలంలోకి ప్రయాణించడం మొదలుపెట్టింది అన్న విషయం మాత్రం నిజం**

## యువతి వివాహానికి వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**కరపత్రం ప్రతినిది గోదావరిఖని ఏప్రిల్ 24:**
రామగుండం నియోజకవర్గం 9వ డివిజన్ వినోబానగర్ లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన చెల్లెలు రాసూరి సాహితి తల్లిదండ్రులు చనిపోవడం వలన ఒంటరిగా ఉంటుంది. ఈనెల 26వ తేదీన తన వివాహం ఉన్నందున పెళ్లి ఖర్చుల గురించి వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి కడమండ శ్రీహరి తీసుకెళ్లడం జరిగింది. ఈ విషయంపై హరీష్ రెడ్డి వెంటనే స్పందించి వివాహ ఖర్చుల గురించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కడమండ శ్రీహరి, పోయిల రవి కుమార్, బొబ్బిలి సతీష్, రోడ్డ సంపత్, పల్లె మహేందర్, కందుగుల రాజు, మాల సంఘం ముఖ్య నాయకులు నంది నరేష్. పిట్టల వెంకటి. నూకల మొండి.నంది నాగేశ్వరరావు, బస్తీ పెద్ద మనుషులు బెద శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సహాయం చేసిన వ్యాల హరీష్ రెడ్డికి చెల్లెలు రాసూరి సాహితి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మంథని మండల ఫోటో & వీడియో యూనియన్ సభ్యులు

**కరపత్రం ప్రతినిది మంథని, ఏప్రిల్ 24:**



మంథని పట్టణం శ్రీపాద కాలని కి చెందిన శ్రీ రామ ఫోటో స్టూడియో యజమాని గంధం నగేష్ (55) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందగా. శుక్రవారం అతని అంత్యక్రియలకు మంథని మండల ఫోటో&వీడియో గ్రాఫర్ యూనియన్ సభ్యులు పాల్గొని మృతుని కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు నగేష్ మాతో కలిసి మెలిసి ఉండి యూనియన్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అతని సేవలు మరవలేవని యూనియన్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మరియు స్టేట్, జిల్లా యూనియన్ సభ్యులు వివిధ మండలాలకు చెందిన ఫోటో & వీడియో గ్రాఫర్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరిక

**కరపత్రం ప్రతినిది హుజురాబాద్ ఏప్రిల్ 24**
హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కొనసాగితే తీవ్రంగా వ్యతిరేక ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.బీజేపీ మండల, పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన అన్నారు. కాలుష్యం పెరిగి తాగునీటి సమస్యలు, వ్యాధులు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం





చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు విషయంలో ప్రజా పోరాటాలతో పాటు న్యాయపరమైన చర్యలు కూడా చేపడతామని తెలిపారు. అవసరమైతే మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లను ఆశ్రయించి, రాష్ట్ర గవర్నర్‌ను కలుసుకుని వినతి పత్రం అందజేస్తామని చెప్పారు.

హుజూరాబాద్ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వేములవాడ అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే, శ్రీమంతం కార్యక్రమం



**కరపత్రం ప్రతినిది వేములవాడ**
వేములవాడ ఓల్డ్ అర్బన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డేతో పాటు గర్భిణీలకు శ్రీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ చిన్నారులలో శారీరక, మానసిక, భాషా, సృజనాత్మక, సామాజిక-భావోద్వేగ అభివృద్ధికి అంగన్వాడీ ప్రీ స్కూల్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల్లో మెదడు అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందని, ఈ దశలో పోషకాహారం, ఆటపాటలతో కూడిన విద్య కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సుచరిత, ఎం ఎల్ హెచ్ ఓ మధు ప్రవచిని, ఏఎన్ఎం సృజన, అంగన్వాడి టీచర్ జ్యోతి, రఫియా, ఏఎల్ఎంఎస్ సి కమిటీ సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు శ్రీకారం

- తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి
- రుద్రంగిలో కొత్త పోలీస్ స్టేషన్ శంకుస్థాపన

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి డీజీపీ బి.శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని, ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లు, భీమారంలో కొత్త పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

- ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం

**– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు సెలవుల్లో రోజుల్లో కూడా విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ తాను నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే,రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ అధికారులు సుందర్, రాజశేఖర్, వినయ్ , సుదర్శన్,సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# జమ్మికుంటలో తెలంగాణ ఉద్యమ ఫోరం సమావేశం... ఉద్యమకారుల గుర్తింపుకు కమిటీ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 24:**

తెలంగాణ ఉద్యమ ఫోరం ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం జమ్మికుంటలోని శంకరానందన్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి ఎక్కటి సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని బలిదానాలు చేసిన వారితో పాటు ఉద్యమానికి సహకరించిన ప్రతి ఒక్కరిని గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే, ఎన్నికల హామీలను అమలు చేయాలని ఫోరం తరఫున ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్ గౌడ్, శాసన మండలి సభ్యులు విజయశాంతి, కోదండరాం మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించి, త్వరలో కమిటీ ఏర్పాటు చేసి శుభవార్త అందించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సంస్థను మరింత బలోపేతం చేయడానికి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సంజీవ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర చైర్మన్ సీమ శ్రీనివాస్ మరియు రాష్ట్ర నాయకత్వం తనను ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. హుజూరాబాద్ ప్రాంతం ఉద్యమాలకు కేంద్రబిందువని, ఇక్కడి ఉద్యమకారుల సహకారంతోనే ఈ బాధ్యత దక్కిందని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు.



ఈ సమావేశంలో సర్పంచులు నకిర్తరాజు, జక్కే కిరణ్, కందికట్ల మధుసూదన్, మూడేళ్ల కుమారస్వామి, లక్ష్మీ రవీందర్, కొండా అర్జున్ పాల్గొన్నారు. ఉప సర్పంచులు కొండల్ రెడ్డి, రాజు, రజనీకాంత్ హాజరయ్యారు.

అదేవిధంగా చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్వేశం, కనబోయిన శ్రీనివాస్ (మాజీ మార్కెట్ అధ్యక్షులు), కట్టంగూరి శ్రీకాంత్ రెడ్డి (మాజీ సహకార సంఘ అధ్యక్షులు), హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరే రమేష్ రెడ్డి, జమ్మికుంట మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ జూనియర్ బాలుర కళాశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం

**కరపత్రం ప్రతినిధి అందోలు**

అందోల్ జోగిపేట మైనారిటీ జూనియర్ కళాశాలలో సిఈసి, ఎం ఈ సీ కోర్సుల స్థానంలో ఒకేషనల్ కోర్సులు. పరిచయం చేయడం కొరకు జోగిపేట-అందోల్ కాన్సెన్సి స్థానిక మైనారిటీ మరియు లోకల్ లీడర్స్ మరియు ఇమామ్‌ల మీటింగ్ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయం సేకరించారు.మైనారిటీ జూనియర్ బాయ్స్ కళాశాలలో అడ్మిషన్స్ కొరకు పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్ ఎల్ సి,బహుమతి , విజిలెన్స్ అధికారులు జగదీశ్వర్ రెడ్డి, ఎం డి.గౌస్ పాషా, ప్రిన్సిపాల్ జీవేందర్ పాల్గొనడం జరిగింది.



మైనారిటీ సంస్థ యొక్క విజన్‌ని వివరించారు.ఈ సమావేశంలో పిల్లల వెల్ఫేర్ గురించి మాట్లాడటం జరిగింది.ఈ సమావేశంలో ఒకేషనల్ కోర్సులో ఏ కోర్సు పెడితే బాగుంటుందో అభిప్రాయాలు తీసుకోవడం జరిగింది.పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ఒకేషనల్ కోర్సులు ప్రవేశ పెట్టడానికి సుముఖత చూపడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ యూత్ నాయకులు చోటు ఖాన్, జీషాన్, నజీర్, ఖాలేద్, మహబూబ్ ఖాన్, ఆలీష ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతికి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి

- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి
- కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**



ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆయన మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండల్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు రెండున్నరేండ్లు అవుతున్నా, అప్పటి నుంచి తమ సమస్యలు పరిషరించాలని ఆర్టీసీ కార్మికులు వేడుకుంటున్నా ప్రభుత్వం మొండివైఖరినీ అవలంభిస్తుందని విమర్శించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

# పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 24**



జమ్మికుంట పట్టణ పరిధిలోని రామన్నపల్లి ప్రాంతంలో మేడిపల్లి వాసు--కళ్యాణి దంపతుల కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి పుట్టినరోజును సంతోషంగా జరుపుకున్నారు.ఈ ప్రత్యేక వేడుకలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారికి ఆశీర్వాదాలు అందించారు. చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, స్థానిక కౌన్సిలర్ కొలకని రాజకుమారి తో పాటు రాజు, శ్రీనివాస్, చింటూ, సలీం తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, చిన్నారి తల్లిదండ్రులు ఆహ్వానితులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అతిథులందరికీ ఆతిథ్యాన్ని అందిస్తూ వేడుకను మరింత సంతోషంగా నిర్వహించారు.స్థానిక ప్రజలు, స్నేహితులు కలిసి పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. చిన్నారి మొదటి పుట్టినరోజు వేడుక కుటుంబానికి చిరస్మరణీయంగా నిలిచింది.

# కోరపల్లి శివాలయం కమిటీపై వివాదం... పారదర్శక నియామకానికి వినతి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 24:**

జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామ శివాలయం కమిటీ ఏర్పాటు నోటిఫికేషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రాకేష్ ముదిరాజ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, కోరపల్లి గ్రామ శివాలయానికి కమిటీ ఏర్పాటు ప్రక్రియలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక భక్తుల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ రామారావు కూడా పాల్గొని, ఆలయ అభివృద్ధికి సమర్ధవంతమైన కమిటీ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడే విధంగా కమిటీ ఏర్పాటు జరగాలని సూచించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యను సానుకూలంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# దేవాలయ అభివృద్ధికి గోలి రవికిరణ్ దంపతుల విరాళం... ప్రజాసేవలో ముందడుగు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, ఏప్రిల్ 24:**

ఇల్లందకుంటలో ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తున్న గోలి రవికిరణ్ -- పవిత్ర దంపతులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి కోసం రూ. 5,516 నగదును విరాళంగా అందించారు.ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ధర్మకర్తగా, అలాగే గ్రామపంచాయితీ 1వ వార్డు సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గోలి రవికిరణ్, ఆధ్యాత్మికతతో పాటు గ్రామాభివృద్ధి కూడా సమాంతరంగా జరగాలని పేర్కొన్నారు. “ప్రజలకు సేవ చేయడం అంటే దేవుడికి సేవ చేయడమే” అనే భావనతో ఆయన చేపడుతున్న కార్యక్రమాలు స్థానికంగా ప్రశంసలు పొందుతున్నాయి.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి పనులు మరియు ధార్మిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న నాయకులు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. దేవాలయం మరింత అభివృద్ధి చెంది గ్రామానికి ఆధ్యాత్మిక వాతావరణం కలగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో పైడిమల్ల దేవేందర్, పలేర్ల శ్రీకాంత్, కందాల సదానందం, కందాల దేవేందర్, రంగు సదానందం, రావుల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు. తరువాత స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం గావించగా, ఆలయ డీఈఓ భాస్కర శర్మ డిజిపికి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, లడ్డు ప్రసాదంతో పాటు చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్, పట్టణ సీఐ వీరప్రసాద్, ఆర్ఐ మోడెం సురేష్, తహసిల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పట్టుదల ఫలితం-వరంగల్ టెక్స్టైల్ పార్క్‌కు కేంద్రం భరోసా

వరంగల్ అభివృద్ధి పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి తన సంకల్పబలం చాటారు. వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ త్వరితగతిన ప్రారంభం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని లోక్‌సభలో రూల్ 377 కింద ప్రస్తావించారు. ప్రధానంగా పార్క్ త్వరితగతిన ప్రారంభం కావడానికి అవసరమైన ఆర్థిక, మౌలిక వసతుల మద్దతు పెంచాలని కేంద్రాన్ని ఎంపీ కోరారు. ప్రధాని మిత్ర పథకం కింద ఈ ప్రాజెక్ట్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేశారు.